Follow: @ANNTELUGU

27-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 204 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండెపోటు

- డాక్టర్లకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్
- హుటాహుటిన వరంగల్ కు కేటీఆర్, హరీష్
- హనుమకొండ నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు
- గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసిన ప్రభుత్వం.. తొలగిన ముప్పు

**వరంగల్, మహా :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండలోని తన నివాసంలో ఈ ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక రోహిణి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు వరంగల్ బయల్దేరారు. రోహిణి వైద్యులతో మాజీ మంత్రి హరీశ్ రావు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

**సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై కేసీఆర్ ఆరా**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆరా తీశారు. ఆయన వెంటే ఉండి అత్యుత్తమ చికిత్స

మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**

పరీక్షల సంస్కరణల కోసం

### నందన్ నిలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్

- ఇన్ స్టాలో వీడియో పోస్ట్ చేసిన మోదీ



02

### వచ్చే ఎన్నికల్లో పోటీచేయను


- రాజకీయాలు అవినీతిమయం
- మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రకటన



02

### జెన్‌జీలకు మంత్రి పదవులు ఇవ్వండి

- సీఎం రేవంత్ కు బండి సంజయ్ డిమాండ్
- మాటలు కాదు.. ఆచరణలో చూపించండి.
- ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి యువతకు అవకాశం కల్పించాలి



02




## ఆదిలాబాద్‌కు రేవంత్ వరం

- ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి ₹2,278.14 కోట్లు
- 700 ఎకరాల భూసేకరణకు గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కంది శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్/ఆదిలాబాద్, మహా :** ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో కీలక మైలురాయిగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ అడుగు వేసింది. ఆదిలాబాద్ అభివృద్ధిపై ముందునుండీ ప్రత్యేక శ్రద్ధ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇపుడు ఉత్తర తెలంగాణను మలుపుతిప్పే కీలక ప్రాజెక్టుకు భారీ నిధులు మంజూరుచేశారు. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం అవసరమైన 700 ఎకరాల భూసేకరణతో పాటు వివిధ శాఖల పనులకు మొత్తం ₹2,278.14 కోట్ల

మిగతా 2వ పేజీలో

బాలయ్యను పరామర్శించిన

## చంద్రబాబు

ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా.

02



## 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ

- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన
- శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్
- 21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న
- ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం

02







# ఆదిలాబాద్‌కు రేవంత్ వరం

**( మొదటి పేజీ తరువాయి )**

అంచనా వ్యయానికి సంబంధించిన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు సంబంధించి రవాణా, రోడ్లు, భవనాల (ఎయిర్‌పోర్ట్స్) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రక్షణ శాఖ అనుమతులతో జాయింట్ యూజ్ ఎయిర్‌పోర్ట్ గా ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌తో పాటు పౌర విమానయాన సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డికి కంది శ్రీనివాస రెడ్డి కృతజ్ఞతలు**

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని, భూసేకరణతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయడంపై ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం చర్యలు చేపట్టడం ఉత్తర తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఒక కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్‌తో పాటు కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగ అభివృద్ధి, వేలాది ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆదిలాబాద్ చరిత్రలో సీఎం నిలిచిపోతారన్నారు.

| ప్రధానాంశాలు |
| --- |
| రూ. 2,278.14 కోట్ల అంచనా వ్యయం |
| 700 ఎకరాల భూసేకరణ |
| రహదారుల మార్పు, విద్యుత్ టవర్ల తరలింపు, నీటి పైప్‌లైన్ల మార్పు వంటి పనులకు అనుమతి |
| భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరణకు అవకాశం |
| ఉత్తర తెలంగాణకు విమాన అనుసంధానంలో భారీ ఊతం |
| **ఆదిలాబాద్ జిల్లాకు కలిగే ప్రయోజనాలు** |
| పెట్టుబడులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు |
| పర్యాటక రంగానికి ఊతం |
| ఉద్యోగావకాశాల పెరుగుదల |
| హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు వేగవంతమైన విమాన సౌకర్యం |
| ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల అభివృద్ధికి దోహదం |

# పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండెపోటు

**( మొదటి పేజీ తరువాయి )**

అందేలా చూడాలిని కేటీఆర్‌ను ఆదేశించారు. ఉదయం నుంచి పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు కేసీఆర్ వాకబు చేస్తున్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, వినోద్ రావు జిల్లా నేతలతో కేసీఆర్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అప్రమత్తం చేస్తున్నారు. సుదర్శన్ రెడ్డికి మెరుగైన చికిత్స అందేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆరోగ్య సమాచారాన్ని, మెరుగైన చికిత్స కోసం వారు చేస్తున్న ప్రయత్నాలను డాక్టర్లు కేసీఆర్‌కు వివరించారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

**వైద్యురాలిని ప్రశంసించిన హరీశ్‌రావు**

పెద్ది సుదర్శన్ ప్రాణాలు కాపాడేందుకు కృషి చేసిన డాక్టర్ మమతకు మాజీమంత్రి హరీశ్ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దికి పలుమార్లు సీపీఆర్ చేసి గుండె లయ సరిచేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ మమత లాంటి వారు వైద్య వృత్తి ఉన్నతమైనదనడానికి నిదర్శనం అని హరీశ్‌రావు అన్నారు. అలాంటి డాక్టర్లు భూమిపై ఉన్న దేవళ్లతో సమానం అని కీర్తించారు. పెద్ది సుదర్శన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు**

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆసుపత్రి ప్రాంగణంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి అన్నింటిని అధిగమించి ప్రాణపాయం నుంచి బయటపడ్డారని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం డాక్టర్ల పర్యవేక్షణలో హైదరాబాద్ తీసుకెళ్తున్నట్లు చెప్పారు. దీనికోసం ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని చెప్పారు. దీనికి సుదర్శన్ రెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఆయనను అంబులెన్సులో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అంబులెన్సు వెంట కేటీఆర్, హరీశ్‌రావులు ఉన్నారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీచేయను

- **రాజకీయాలు అవినీతిమయం**
- **మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రకటన**



**బెంగళూరు, మహా :** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎన్నికల రాజకీయాలకు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేసిన ఆయన, ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ప్రజా జీవితానికి దూరం కాబోనని, క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజల సమస్యలపై తన గళాన్ని వినిపిస్తానని స్పష్టం చేశారు. సిద్ధరామయ్య నిర్ణయం కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా కర్ణాటక రాజకీయాల్లోనూ కొత్త చర్చకు తెరలేపింది. ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన సిద్ధరామయ్య, ప్రస్తుత రాజకీయ వాతావరణంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో రాజకీయాలు కలుషితమైపోయాయని పేర్కొంటూ, ప్రజాసేవకు ఎన్నికల్లో పోటీ చేయడం ఒక్కటే మార్గం కాదని అభిప్రాయపడ్డారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, వారి సమస్యలను ప్రస్తావించడం ద్వారానే ప్రజాసేవను కొనసాగిస్తానని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ నియోజకవర్గ ప్రజలు మరోసారి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుతున్నప్పటికీ, తన నిర్ణయాన్ని మార్చుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ప్రజల ప్రేమ, ఆదరణ జీవితాంతం గుర్తుండిపోతుందని పేర్కొంటూ, అధికార పదవులు శాశ్వతం కావని, ప్రజల విశ్వాసమే నాయకుడికి అతి పెద్ద సంపద అని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో శాసనసభ్యుడు, ప్రతిపక్ష నాయకుడు, ఉప ముఖ్యమంత్రి, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య కర్ణాటక రాజకీయాల్లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. సామాజిక న్యాయం, సంక్షేమ పథకాలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అందువల్ల ఎన్నికల రాజకీయాలకు ఆయన స్వచ్ఛందంగా దూరమవుతానని ప్రకటించడం కాంగ్రెస్ భవిష్యత్ నాయకత్వంపై చర్చకు దారితీసింది. సిద్ధరామయ్య ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, పార్టీ వ్యూహాల రూపకల్పన, ఎన్నికల ప్రచారం, ప్రజా ఉద్యమాలు, ప్రభుత్వ విధానాలపై తన ప్రభావం కొనసాగించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2028 ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఆలోచన కూడా ఆయన నిర్ణయం వెనుక ఉండొచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ



**హైదరాబాద్, మహా :** యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఆదివారం జాతీయమీడియాతో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్‌జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు.

**మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధికి సహకరించాలి**

. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

# పశ్చిమాసియాలో యుద్ధ విరామ సంకేతాలు

**దాడులు నిలిపేసిన అమెరికా, ఇరాన్.**
**గల్ఫ్‌లో ఉద్రిక్తతకు తాత్కాలిక బ్రేక్.**



పశ్చిమాసియాలో యుద్ధ విరామ సంకేతాలు.

గత కొన్ని నెలలుగా పశ్చిమాసియాను అగ్నిగుండంలా మార్చిన అమెరికా-ఇరాన్ ఘర్షణల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వరుస సైనిక దాడులతో పరస్పరం ఎదురుదాడులకు దిగిన రెండు దేశాలు తాజాగా తాత్కాలికంగా వెనక్కి తగ్గడంతో ప్రాంతంలో యుద్ధ విరామ సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేయగా, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. దీంతో నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్త పరిస్థితులకు తాత్కాలికంగా ఉపశమనం లభించినట్లు కనిపిస్తోంది.

అమెరికా వరుస దాడులకు ప్రతిస్పందనగానే తాము చర్యలు చేపట్టామని, గత రెండు రోజులుగా అమెరికా ఎలాంటి దాడులకు పాల్పడకపోవడంతో ప్రతీకార చర్యలను కూడా నిలిపివేసినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. తమ వ్యూహం పూర్తిగా ప్రతిస్పందనాత్మకమేనని పేర్కొన్న టెహ్రాన్, అమెరికా మళ్లీ దాడులకు దిగితే తాము కూడా తిరిగి ఎదురుదాడులు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. అమెరికా అకస్మాత్తుగా సైనిక చర్యలను నిలిపివేయడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వరుసగా రెండు వారాల పాటు నిర్వహించిన వైమానిక దాడుల కారణంగా పేట్రియాట్ వంటి వైమానిక రక్షణ క్షిపణుల నిల్వలు తగ్గినట్లు సమాచారం. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వాషింగ్టన్ పర్యటన నేపథ్యంలో దౌత్య చర్చలకు అవకాశం కల్పించేందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ తాత్కాలిక విరామానికి మొగ్గుచూపినట్లు అంతర్జాతీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే పశ్చిమాసియాలో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్నాయనడానికి ఇంకా అవకాశం కనిపించడం లేదు. యెమెన్‌లో ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటు దళాలు తమ దాడులను కొనసాగిస్తున్నాయి. సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతాల్లోని ఆరామ్‌కో చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకుని హౌతీలు వరుస క్షిపణి దాడులకు పాల్పడినట్లు సమాచారం. ఈ దాడులను అడ్డుకునేందుకు సౌదీలో మోహరించిన గ్రీకు రక్షణ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులతో పాటు ఒక డ్రోన్‌ను విజయవంతంగా కూల్చివేసినట్లు గ్రీస్ వాయుసేన వర్గాలు వెల్లడించాయి. అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలికంగా ఉద్రిక్తత తగ్గినప్పటికీ, ప్రాంతీయ మిలీషియా దళాల కార్యకలాపాలు కొనసాగుతుండటంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా పూర్తిగా ప్రశాంతంగా మారలేదని రక్షణ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దౌత్య చర్చలు ఫలిస్తేనే దీర్ఘకాలిక శాంతికి మార్గం సుగమమవుతుందని, లేదంటే ఎప్పుడైనా మరోసారి ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# రాష్ట్రీయతతోనే దేశాభివృద్ధి.

**వైద్యుల సేవలు సమాజానికి అమూల్యం.**
**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు.**

**హైదరాబాద్, మహా.**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జాతీయ భావనతో కూడిన అభివృద్ధి విధానాల ద్వారానే దేశం సమగ్ర ప్రగతి సాధిస్తుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. వైద్యులు అందించే సేవలు వ్యక్తుల ఆరోగ్యానికే పరిమితం కావని, సమాజం, దేశ నిర్మాణానికి కీలకమైనవని పేర్కొన్నారు. బీజేపీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

దేశ ఆరోగ్య రంగానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాంచందర్‌రావు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ద్వారా జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానలకు వేల కోట్ల రూపాయల నిధులు అందిస్తున్నట్లు చెప్పారు. మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది వేతనాల వరకు అవసరమైన నిధుల్లో అధిక భాగాన్ని కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తోందని పేర్కొన్నారు.

కోవిడ్ మహమ్మారి సమయంలో స్వదేశీ వ్యాక్సిన్ అభివృద్ధిలో భారత్ బయోటెక్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అందించిన ప్రోత్సాహం కీలకపాత్ర పోషించిందని ఆయన అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం కేవలం పరిశుభ్రతకే పరిమితం కాకుండా 'స్వస్థ్ భారత్' లక్ష్య సాధనకు బలమైన పునాదిగా నిలిచిందని చెప్పారు. ఖేలో ఇండియా, అంతర్జాతీయ యోగా దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు.

సామాజిక మాధ్యమాల్లో, ముఖ్యంగా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో ప్రచారంలోకి వచ్చే అనధికారిక వైద్య సలహాలు, చిట్కాలను నమ్మి ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్యుల సలహాలు మాత్రమే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ సరిహద్దుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు రాంచందర్‌రావు ఘన నివాళులు అర్పించారు. దేశభక్తి, జాతీయ భావన యువతలో మరింత బలపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ భద్రత, సమగ్రతను కాపాడడంలో సాయుధ దళాల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

ఇజ్రాయెల్ వంటి చిన్న దేశాలు జాతీయ భావం, పరిశోధనలకు ప్రాధాన్యం, సైనిక శిక్షణ, ఆధునిక వైద్య వ్యవస్థలతో ప్రపంచంలో శక్తివంతమైన దేశాలుగా ఎదిగాయని రాంచందర్‌రావు గుర్తుచేశారు. సోషలిజం, కమ్యూనిజం, క్యాపిటలిజం కంటే రాష్ట్రీయత ద్వారానే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న వైద్యులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేవలందిస్తున్న ప్రతి వైద్యుడు సమాజానికి విలువైన ఆస్తి అని కొనియాడారు.



# జెన్‌జీలకు మంత్రి పదవులు ఇవ్వండి

- **సీఎం రేవంత్ కు బండి సంజయ్ డిమాండ్**
- **మాటలు కాదు.. ఆచరణలో చూపించండి.**
- **ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి యువతకు అవకాశం కల్పించాలి**



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో యువతకు అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన మాటలను ఆచరణలో నిరూపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. నిజంగా యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి జెన్‌జీలకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న హోం, విద్య, మున్సిపల్ శాఖలను యువ నాయకులకు అప్పగించాలని సూచించారు. ఆదివారం శంషాబాద్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జెన్‌జీలకు అవకాశాలు ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్, ఆచరణలో మాత్రం వయసు పైబడిన నాయకులకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి దృష్టిలో జెన్‌జీలు అంటే వీ. హనుమంతరావు (వీహెచ్), కె. కేశవరావు (కేకే), కోదండరెడ్డి వంటి సీనియర్ నేతలేనని ఎద్దేవా చేశారు. వృద్ధులకు, వయసు దాటిన పెద్దలకు 'యూత్ కోటా' పేరుతో పదవులు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటైందని వ్యాఖ్యానించారు. యువతకు నిజమైన ప్రాధాన్యం ఇవ్వాలంటే రాజకీయ సంకల్పం అవసరమని, కేవలం ప్రకటనలతో సరిపెట్టకుండా అధికారంలో భాగస్వామ్యం కల్పించాలని బండి సంజయ్ అన్నారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.

# అస్సాంలో 26 మంది అటవీ సిబ్బంది క్షేమం

**రెండు రోజుల గాలింపునకు సుఖాంతం.**

**గువాహటి, మహా:** అస్సాంలోని దిమా హసావో జిల్లాలో రెండు రోజులుగా గల్లంతైన 23 మంది అటవీ అధికారులు, ముగ్గురు సహాయక సిబ్బంది సహా మొత్తం 26 మంది సురక్షితంగా లభ్యమవడంతో అటవీశాఖతో పాటు వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడంతోనే వారితో సంబంధాలు తెగిపోయాయని, గాలింపు చర్యల అనంతరం బృందాన్ని గుర్తించి సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు అస్సాం అటవీశాఖ మంత్రి జయంత మల్లబారువా వెల్లడించారు.


దిమా హసావో, కర్బి ఆంగ్లాంగ్, నాగాలాండ్ సరిహద్దు ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాల్లో అధికారులు తరచూ పెట్రోలింగ్, కూంబింగ్ ఆపరేషన్లు, అటవీ సర్వేలు నిర్వహిస్తుంటారు. ఇదే క్రమంలో శుక్రవారం 23 మంది అటవీ అధికారులు, ముగ్గురు సహాయక సిబ్బందితో కూడిన బృందం అధికారిక విధుల నిమిత్తం అడవిలోకి వెళ్లింది. అయితే ఆ ప్రాంతంలో మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా లేకపోవడంతో శుక్రవారం నుంచి వారితో ఎలాంటి సమాచార మార్పిడి జరగలేదు.

రెండు రోజుల పాటు బృందం ఆచూకీ లభించకపోవడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమై భారీ గాలింపు చర్యలు ప్రారంభించారు. స్థానిక అటవీ సిబ్బంది, ప్రత్యేక బృందాలు, స్థానికుల సహకారంతో అడవిలో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించింది.

లాంగ్టింగ్, మందర్‌దిసా, హాతిఖోలా, మైబోంగ్ రేంజ్‌లకు చెందిన ఈ సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు అటవీశాఖ మంత్రి జయంత మల్లబారువా సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో సమాచార వ్యవస్థ అందుబాటులో లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, ఎలాంటి ప్రమాదం జరగలేదని స్పష్టం చేశారు.

సిబ్బంది సురక్షితంగా తిరిగి రావడంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊరట వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మారుమూల అటవీ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర సమాచార పరికరాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై మరోసారి చర్చ మొదలైంది





## పరీక్షల సంస్కరణల కోసం..

- **నందన్ నిలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్**
- **ఇన్ స్టాలో వీడియో పోస్ట్ చేసిన మోదీ**

**ఢిల్లీ, మహా :** పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నలికేని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత ప్రభుత్వం నిరంతరం వివిధ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారు ఇప్పుడు జైలులో మగ్గుతున్నారని వ్యాఖ్యానించారు. దీని కోసం మేము ఇప్పటికే ఫాస్ట్ ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం పార్లమెంట్‌లో కూడా కఠినమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు మోదీ ఇన్‌స్టాలో వీడియో పోస్టు చేశారు.

# కామన్వెల్త్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

**మీరాబాయి చాను చరిత్ర.**
**వరుసగా మూడోసారి గోల్డ్ మెడల్.**



**గ్లాస్గో,మహా :** కామన్వెల్త్ గేమ్స్2026లో భారత్ స్వర్ణ ఖాతా తెరిచింది. స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మహిళల 48 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కామన్వెల్త్ క్రీడల్లో వరుసగా మూడోసారి స్వర్ణ పతకం సాధిస్తూ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటిన చాను, రెండు గేమ్స్ రికార్డులు నెలకొల్పి భారత క్రీడాభిమానులను ఆనందంలో ముంచెత్తింది.పోటీల్లో ఆరంభం నుంచే ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన మీరాబాయి చాను స్నాచ్ విభాగంలో 85 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి కొత్త గేమ్స్ రికార్డు సృష్టించింది. అనంతరం క్లీన్ అండ్ జర్క్‌లో 105 కిలోలు లిఫ్ట్ చేసి తన సత్తా చాటింది. మొత్తంగా 190 కిలోల బరువును ఎత్తి మరో గేమ్స్ రికార్డును తన పేరిట లిఖించుకుంటూ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ విభాగంలో నైజీరియాకు చెందిన రూత్ అసుక్వో న్యోంగ్ మొత్తం 168 కిలోలు ఎత్తి రజత పతకం సాధించగా, మలేసియాకు చెందిన ఐరీన్ జేన్ హెన్రీ 167 కిలోలతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అయితే చాను ప్రదర్శనకు వారిద్దరూ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు.ఇదిలా ఉండగా, వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు ఇదే రోజున రెండో పతకం కూడా లభించింది. అంతకుముందు పురుషుల 60 కిలోల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రిషికంత సింగ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ల విజయపరంపర కొనసాగుతుండగా, రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధిస్తారనే ఆశలు క్రీడాభిమానుల్లో నెలకొన్నాయి.



# ఆకాశహర్మ్యాల్లో భారత్ దూకుడు

**ప్రపంచ స్కైలైన్‌ను శాసిస్తున్న భారత నగరాలు.**

**హైదరాబాద్, మహా** ప్రపంచ రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగంలో భారతదేశం కొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఒకప్పుడు అమెరికా, చైనా, దుబాయ్ నగరాలకే పరిమితమైన ఆకాశహర్మ్యాల (స్కైస్క్రేపర్స్) నిర్మాణంలో ఇప్పుడు భారత నగరాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. 2026 నాటికి నిర్మాణంలో ఉన్న అత్యంత ఎత్తైన భవనాల సంఖ్య ఆధారంగా ప్రపంచ టాప్10 నగరాల జాబితాలో ఏకంగా ఐదు స్థానాలను భారత నగరాలు దక్కించుకోవడం దేశ పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు అద్దం పడుతోంది. భారీ పెట్టుబడులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగం, స్థల కొరత, ఆధునిక జీవన శైలిపై పెరుగుతున్న ఆసక్తి భారత నగరాలను ప్రపంచ స్కైలైన్‌లో అగ్రస్థానానికి తీసుకెళ్తున్నాయి.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 300కుపైగా ఆకాశహర్మ్యాలతో ముంబై ప్రపంచంలోనే తొలి స్థానంలో నిలవడం విశేషం. ఒకప్పుడు న్యూయార్క్, షాంఘై, దుబాయ్ వంటి నగరాలకే పరిమితమైన ఈ ఘనత ఇప్పుడు ముంబై సొంతమైంది. 181 భారీ టవర్ల నిర్మాణంతో గురుగ్రామ్ రెండో స్థానంలో నిలవగా, 170 నిర్మాణాలతో హైదరాబాద్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 100 నిర్మాణాలతో రష్యా రాజధాని మాస్కో నాలుగో స్థానంలో నిలవగా, 79 ప్రాజెక్టులతో థానే ఐదో స్థానంలో నిలిచింది.

ఒకప్పుడు నిర్మాణ రంగంలో ప్రపంచాన్ని శాసించిన చైనా నగరాలు ఈసారి భారత నగరాల దూకుడుకు వెనుకబడడం విశేషం. షెన్జెన్ 73 నిర్మాణాలతో తర్వాతి స్థానంలో నిలవగా, దుబాయ్ కేవలం 38 నిర్మాణాలతో ఏడో స్థానానికి పరిమితమైంది. గ్వాంగ్‌జౌ, వుహాన్ వంటి చైనా నగరాలు కూడా గతంతో పోలిస్తే వెనుకబడ్డాయి. 27 నిర్మాణాలతో నవీ ముంబై టాప్10 జాబితాలో చోటు సంపాదించడం భారత పట్టణాభివృద్ధి ఎంత వేగంగా సాగుతోందో స్పష్టం చేస్తోంది.



భారతదేశంలో ఈ స్థాయిలో నిలువునా నిర్మాణాలు పెరగడానికి అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. వేగంగా పెరుగుతున్న పట్టణ జనాభా, భూమి కొరత, మెట్రో నగరాల్లో భూముల ధరలు భారీగా పెరగడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), ప్రవాస భారతీయుల పెట్టుబడులు, బహుళజాతి సంస్థల విస్తరణ నిర్మాణ రంగానికి ఊతమిచ్చాయి. కోవిడ్ అనంతరం విశాలమైన గేటెడ్ కమ్యూనిటీలు, స్మార్ట్ అపార్ట్‌మెంట్లు, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నివాస సముదాయాలకు డిమాండ్ పెరగడంతో డెవలపర్లు ఎత్తైన టవర్ల నిర్మాణంపై దృష్టి సారించారు. తక్కువ స్థలంలో ఎక్కువ నివాసాలు, కార్యాలయాలు ఏర్పాటు చేయగల సామర్థ్యం కూడా ఆకాశహర్మ్యాల నిర్మాణాన్ని వేగవంతం చేసింది.

ముంబై, థానే, నవీ ముంబై ప్రాంతాలు ఈ అభివృద్ధికి కేంద్ర బిందువులుగా మారాయి. ముంబైలో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్థల కొరత, పాత భవనాల పునరాభివృద్ధి విధానాలు, సముద్ర తీర నగరమైన కారణంగా విస్తరణకు పరిమిత అవకాశాలు ఉండటంతో నిలువుగా అభివృద్ధి అనివార్యమైంది. ఫలితంగా ప్రపంచంలోనే అత్యధిక స్కైస్క్రేపర్ల నిర్మాణం జరుగుతున్న నగరంగా ముంబై అవతరించింది.

ఐటీ, సేవారంగాల విస్తరణతో గురుగ్రామ్, హైదరాబాద్ నగరాలు అంతర్జాతీయ కార్పొరేట్ కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. హైదరాబాద్‌లోని కోకాపేట్, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ నివాస, వాణిజ్య సముదాయాలు వేగంగా నిర్మితమవుతున్నాయి. గురుగ్రామ్‌లో గోల్ఫ్ కోర్స్ రోడ్, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే పరిసర ప్రాంతాలు అంతర్జాతీయ ప్రమాణాల టవర్లకు కేంద్రాలుగా మారాయి. ఐటీ కంపెనీలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, స్టార్టప్‌లు, అధిక వేతన ఉద్యోగుల పెరుగుదల ఈ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపునిచ్చింది.

చైనా, దుబాయ్ వెనుకబడటానికి కూడా స్పష్టమైన కారణాలున్నాయి. చైనాలో గత కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర మందగమనాన్ని ఎదుర్కొంటోంది. భారీ రుణభారం, నిర్మాణ సంస్థల ఆర్థిక సంక్షోభం, కొత్త భవనాల ఎత్తుపై ప్రభుత్వం విధించిన నియంత్రణలు నిర్మాణ వేగాన్ని తగ్గించాయి. దుబాయ్‌లో ఇప్పటికే భారీ స్థాయిలో అభివృద్ధి పూర్తికావడం, మార్కెట్ స్థిరీకరణ దశకు చేరుకోవడంతో కొత్త ప్రాజెక్టుల సంఖ్య తగ్గింది. ఇదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరించడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటం దేశ నిర్మాణ రంగానికి బలమైన ప్రోత్సాహంగా మారింది.

అయితే ఈ నిర్మాణ విప్లవం ప్రభుత్వాల ముందు కొత్త సవాళ్లను కూడా తీసుకొస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, మురుగునీటి పారుదల, అగ్నిమాపక భద్రత, పార్కింగ్, ప్రజా రవాణా వంటి మౌలిక వసతులను సమాంతరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పర్యావరణ సమతుల్యతను కాపాడే గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు, ఇంధన పొదుపు సాంకేతికత, వర్షపు నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రపంచ స్కైలైన్‌లో భారత నగరాల ఆధిపత్యం కేవలం ఎత్తైన భవనాల సంఖ్యతో పరిమితం కాదు. ఇది భారత ఆర్థిక శక్తి, పట్టణీకరణ వేగం, విదేశీ పెట్టుబడులపై పెరిగిన విశ్వాసం, సాంకేతిక పురోగతి, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రతీకగా నిలుస్తోంది. రానున్న సంవత్సరాల్లో ఈ అభివృద్ధి స్థిరమైన పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ, సమర్థవంతమైన మౌలిక వసతులతో ముందుకు సాగితే ప్రపంచ నిర్మాణ రంగంలో భారతదేశం మరింత అగ్రస్థానాన్ని దక్కించుకోవడం ఖాయమనే అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు మరో ముందడుగు

- **భూసేకరణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు**
- **ధన్యవాదాలు తెలిపిన కంది శ్రీనివాస రెడ్డి**

ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎన్నాళ్లుగానో కలలు కంటున్న ఆదిలాబాద్ జిల్లా వాసుల ఎయిర్ పోర్ట్ కల సాకారమయ్యే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆదిలాబాద్ విమానాశ్రయ భూసేకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తన వాటాగా 2వేల 278.14 కోట్ల నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఇక కేంద్రం ఈ ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వెనుకబడిన జిల్లా వాసుల చిరకాల వాంఛ నెరవేరేలా ఎయిర్ పోర్ట్ కు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్టు కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# దళిత ప్రజాప్రతినిధుల ఆవేదన

- **భట్టి ఎదుట గోడు వెల్లగక్కిన ఎమ్మెల్యేలు.**

హైదరాబాద్, మహా : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం దక్కడం లేదంటూ పలువురు ఎస్సీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలు, అధికారుల బదిలీలు వంటి కీలక విషయాల్లో తమను పూర్తిగా పక్కన పెడుతున్నారని వాపోయారు. ప్రజాభవన్‌లో ఎస్సీ ప్రజాప్రతినిధుల సంఘం చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, కన్వీనర్ మల్లు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.సమావేశంలో మాట్లాడిన దళిత ప్రజాప్రతినిధులు, తమ నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి పర్యటనల వివరాలు, అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల గురించి ముందస్తు సమాచారం కూడా ఇవ్వడం లేదని భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తమకు తగిన ప్రాధాన్యం లేకపోవడం వల్ల ప్రజల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు, కొత్త అధికారుల నియామకాలు కూడా తమకు తెలియకుండా జరుగుతున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ప్రభుత్వ శాఖల కార్యదర్శులను కలిసి సమస్యలు వివరించాలన్నా అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పించడం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని భట్టి విక్రమార్కను కోరారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరుగుతోందని, దానిని వెంటనే అరికట్టకపోతే ప్రభుత్వానికే రాజకీయంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. పార్టీ నాయకుల మధ్య ఉన్న విభేదాలను బహిరంగంగా ప్రదర్శించడం వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని భట్టి విక్రమార్క సూచించినట్లు సమాచారం. అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపైనే చర్చించి పరిష్కరించుకోవాలని, ప్రజల ముందుకు విభేదాలు తీసుకురావద్దని నాయకులకు ఆయన సూచించినట్లు సమావేశంలో పాల్గొన్న వారు తెలిపారు.






# కొండకర్ల ఆవకు పరిరక్షణ హోదా.

- **చిత్తడి నేలల సంరక్షణ వేగవంతం.**
- **డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి, మహా :** రాష్ట్రంలోని చిత్తడి నేలల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, అటవీపర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని జీవ వైవిధ్యానికి నిలయమైన కొండకర్ల ఆవను 'పరిరక్షణ నిల్వ' (కన్జర్వేషన్ రిజర్వ్) ప్రాంతంగా గుర్తించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా చిత్తడి నేలలను గుర్తించి, వాటి సంరక్షణకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కొండకర్ల ఆవ చిత్తడి నేలను కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ) జారీకి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. అటవీశాఖ ప్రతిపాదనలకు జలవనరుల శాఖ కూడా ఆమోదం తెలిపిందన్నారు. సాగునీరు, జలాశయాల నిర్వహణ, హైడ్రాలిక్ వ్యవస్థలు, ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన రక్షణ చర్యలతో ఈ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కొండకర్ల ఆవ జీవ వైవిధ్యానికి ప్రధాన కేంద్రంగా నిలిచిందని, వలస మరియు స్థానిక పక్షులకు ఇది ముఖ్యమైన ఆవాసమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని శాస్త్రీయంగా సర్వే చేసి ఎకోటూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.



రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ అధ్యయనాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా ఇప్పటికే 950 చిత్తడి నేలలను గుర్తించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. వీటిని దశలవారీగా నోటిఫై చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తొలి దశలో 16 చిత్తడి నేలల నోటిఫికేషన్‌కు సంబంధించిన అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు.

చిత్తడి నేలలు జీవ వైవిధ్య పరిరక్షణకు మాత్రమే కాకుండా భూగర్భ జలాల పునరుద్ధరణ, వరదల నియంత్రణ, జల భద్రత, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపులో కీలక పాత్ర పోషిస్తాయని పవన్ కళ్యాణ్ వివరించారు. స్థానిక ప్రజల జీవనోపాధి మెరుగుదలకు కూడా ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. అందుకే చిత్తడి నేలల సంరక్షణను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందన్నారు. అర్హత కలిగిన అన్ని చిత్తడి నేలలను నోటిఫై చేసే ప్రక్రియను సంబంధిత శాఖల సమన్వయంతో వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సంయుక్త సర్వేలు త్వరితగతిన పూర్తి చేసి, చట్టపరమైన అనుమతులను నిర్దిష్ట గడువులో పొందాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

చిత్తడి నేలలపై జరుగుతున్న ఆక్రమణలు, విధ్వంసక చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాలని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. చిత్తశుద్ధితో చిత్తడి నేలల పరిరక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణతో పాటు ఎకోటూరిజం అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొండకర్ల ఆవను పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# హింసతో సమస్యలు పరిష్కారం కావు.

**శాంతియుత ఉద్యమాలే మార్గం.**
**అన్నా హజారే**

అహిల్యానగర్, మహా.ఎలాంటి సమస్యలకైనా హింస పరిష్కారం కాదని, శాంతియుత ఆందోళనలు, చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే అన్నారు. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థుల నిరసనల నేపథ్యంలో స్పందించిన ఆయన, ప్రజా సంక్షేమమే ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల ప్రధాన ధ్యేయంగా ఉండాలని సూచించారు.

మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో మీడియాతో మాట్లాడిన అన్నా హజారే, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, అది శాంతియుత పద్ధతిలోనే సాగాలని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడం, హింసాత్మక మార్గాలను అనుసరించడం లేదా నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం ద్వారా ఎలాంటి శాశ్వత ఫలితాలు సాధించలేమని స్పష్టం చేశారు.తన ప్రజాజీవితంలో ఇప్పటి వరకు 22 సార్లు నిరాహార దీక్ష చేపట్టానని, అయితే ఏ ఒక్క సందర్భంలోనూ హింసను ప్రోత్సహించలేదని హజారే తెలిపారు. శాంతియుత ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన మార్పులు తీసుకురాగలిగామని చెప్పారు. తన ఉద్యమాల ఫలితంగా పది కీలక చట్టాలు అమల్లోకి వచ్చాయని గుర్తు చేశారు.ప్రభుత్వాలు ప్రజల గొంతుకను వినాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నా హజారే సూచించారు. ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైతే ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయడంలో తప్పేమీ లేదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలన్నీ ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో సంభాషణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. హింసతో సమస్యలు పరిష్కారం కావు.

# తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- **రాష్ట్ర అభివృద్ధికి గేమ్‌చేంజర్.**
- **కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**సిద్ధిపేట, మహా :** దేశంలో ప్రతిపాదించిన ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లలో మూడు తెలంగాణకు రానున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు రూ.5 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరగనున్నాయని, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఇవి గేమ్‌చేంజర్‌గా నిలుస్తాయని పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన భవిష్యత్ రైల్వే ప్రాజెక్టులపై కీలక ప్రకటనలు చేశారు.

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించిన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ స్టేషన్ నిర్మాణం భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రెండేళ్లలో స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసి శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి భక్తులకు అంకితం చేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్ నుంచి కేవలం రూ.20 టికెట్‌తో కొమురవెల్లికి చేరుకునే అవకాశం కల్పించామని తెలిపారు.

ప్రస్తుతం ఈ మార్గంలో డీజిల్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలోనే రూ.300 కోట్ల వ్యయంతో ఈ రైల్వే మార్గాన్ని విద్యుద్దీకరిస్తామని వెల్లడించారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ నుంచి దేవాలయం వరకు షటిల్ బస్సు సర్వీసులు నడిపే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. పండుగలు, జాతరల సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ప్రత్యేక రైళ్లు కూడా నడుపుతామని తెలిపారు.

తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా సిరిసిల్లకు రైలు సేవలను ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది వేములవాడ వరకు, 2029 నాటికి కొత్తపల్లి వరకు రైల్వే లైన్ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. అలాగే హైదరాబాద్-యాదాద్రి మధ్య రూ.500 కోట్లతో ఎంఎంటీఎస్ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యేందుకు రాష్ట్రప్రభుత్వం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కోరారు.

పాండురంగాపురం-భద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించిన ఆయన, తెలంగాణ వ్యాప్తంగా ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రానికి ఐదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందించామని గుర్తు చేశారు. కాజీపేటలో నిర్మాణంలో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని వచ్చే ఏడాది ప్రారంభిస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) ప్రాజెక్టుకు సంబంధించి కూడా త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ శుభవార్త చెబుతారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రవాణా, మౌలిక వసతులు, రైల్వే రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులు ఆ లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.



## నిహారిక కొణిదెల
# అందాల సందడి

సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ, చిరునవ్వుతో అభిమానులను మరోసారి మంత్రముగ్ధులను చేసింది నిహారిక కొణిదెల. క్రీమ్‌పింక్ రంగుల అందమైన చీరలో ఆమె ఇచ్చిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సింపుల్ లుక్, హుందాతనం, ఆకట్టుకునే చిరునవ్వుతో నిహారిక మరోసారి తన ప్రత్యేకమైన ఆకర్షణను చాటుకుంది. "ఆ లుక్... ఆ స్మైల్... నిజంగా మ్యాజిక్" అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి చెందిన నిహారిక కొణిదెల, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌కు బంధువుగా మాత్రమే కాకుండా, తన సొంత ప్రతిభతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. 2016లో శ్రీ విష్ణు హీరోగా తెరకెక్కిన 'ఒక మనసు' చిత్రంతో కథానాయికగా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, తొలి సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

ఆ తర్వాత 'హ్యాపీ వెడ్డింగ్', తమిళ చిత్రం 'ఒరు నల్ల నాల్ పాత్తు సోల్రేన్', ఇటీవల విడుదలైన 'డార్లింగ్' (2024) వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా తన ప్రతిభను చాటుకుంటూనే, నిర్మాతగా కూడా విజయవంతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

తన కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ ద్వారా కొత్త కథలను, యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ సినిమాలను నిర్మిస్తోంది. ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఆ చిత్రంలో నిహారిక అతిథి పాత్రలో కూడా కనిపించి ఆకట్టుకుంది.

ప్రస్తుతం తమిళంలో షేన్ నిగమ్ సరసన 'మద్రాస్కారన్' చిత్రంలో నటిస్తున్న నిహారిక, తెలుగులో 'రాకాసా' (2026) చిత్రాన్ని నిర్మించడంతో పాటు ప్రత్యేక పాత్రలో కూడా కనిపించనుంది. నటిగా, నిర్మాతగా, సోషల్ మీడియాలో చురుకైన వ్యక్తిగా అన్ని రంగాల్లో సమతుల్యంగా ముందుకు సాగుతున్న నిహారిక కొణిదెల తన హుందాతనం, ప్రతిభ, అందంతో అభిమానుల హృదయాలను గెలుచుకుంటూనే ఉంది.



# కిరణ్ అబ్బవరం ఓటీటీలోకి..




వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు ఓటీటీ రంగంలోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 'క', 'కేర్యాంప్' చిత్రాల తర్వాత తాజాగా 'చెన్నై లవ్ స్టోరీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన, అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం భారీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నట్లు వెల్లడించారు.'చెన్నై లవ్ స్టోరీ' ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కిరణ్ ఈ విషయాన్ని వెల్లడించారు. శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు. వెబ్ సిరీస్‌ల గురించి అడిగిన ప్రశ్నకు స్పందించిన కిరణ్, ఇప్పటికే ఒక భారీ ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుందని తెలిపారు.'డియర్ కామ్రేడ్' దర్శకుడు భరత్ కమ్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ వెబ్ సిరీస్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియో నిర్మిస్తోందని చెప్పారు. "ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. ప్రేక్షకులకు ఖచ్చితంగా సర్‌ప్రైజ్ ఇస్తుంది. షూటింగ్ దాదాపు పూర్తైంది. మరో పది రోజుల్లో మొత్తం చిత్రీకరణ ముగుస్తుంది" అని కిరణ్ వెల్లడించారు.

ఈ వెబ్ సిరీస్‌కు 'గువ్వల చెరువు ఘాట్' అనే టైటిల్ ఖరారైనట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్‌కు మంచి స్పందన లభించింది. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో సాగే రాజకీయ, యాక్షన్ డ్రామాగా ఈ సిరీస్ రూపొందుతోంది. భారీ తారాగణం, విభిన్న కథాంశంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# బాలయ్య ఆరోగ్యంకోసం ప్రత్యేక పూజలు

నందమూరి బాలకృష్ణ ఇటీవల గాయపడటంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన కాలికి విజయవంతంగా చిన్న శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. ఈ నేపథ్యంలో బాలయ్య త్వరగా కోలుకోవాలని కోరుతూ 'ఎన్‌బికె111' చిత్రబృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది.



ిత్ర దర్శకుడు గోపీచంద్ మాలినేని బెంగళూరులోని హుస్కూర్‌కంబలిపురలో ఉన్న కాటేమ్మ ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ పూజల్లో సుమారు 18 మంది పూజారులు పాల్గొనగా, బాలకృష్ణ అభిమానులు కూడా హాజరై ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. చిత్రబృందం చూపిన అభిమానానికి నందమూరి అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.

మరోవైపు బాలకృష్ణ ఈరోజే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే పూర్తిగా కోలుకోవడానికి మరికొన్ని వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో ఆయన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను తాత్కాలికంగా వాయిదా వేసి, ఇతర నటీనటులతో షూటింగ్ కొనసాగించాలని బాలయ్య చిత్రబృందానికి సూచించినట్లు తెలుస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో 'ఎన్‌బికె111' విడుదల తేదీపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. తొలుత డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, బాలయ్య కోలుకునే సమయాన్ని బట్టి షూటింగ్ షెడ్యూల్‌లో మార్పులు ఉండే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.అయితే బాలకృష్ణ ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతుండటంతో త్వరలోనే ఆయన మళ్లీ సెట్స్‌లో అడుగుపెడతారని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. విడుదల తేదీపై అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉంది.

# సీత పాత్రకు రూ.20 కోట్లు?

టాలీవుడ్, కోలీవుడ్‌లో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి ఇప్పుడు దేశవ్యాప్తంగా అత్యంత డిమాండ్ ఉన్న కథానాయికల్లో ఒకరిగా నిలిచారు. గ్లామర్ కంటే కథకు, పాత్రకు ప్రాధాన్యత ఇచ్చే ఆమె కెరీర్‌లో మరో ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'. ఈ సినిమాలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

శివకార్తికేయన్ సరసన నటించిన 'అమరన్' ఘనవిజయం తర్వాత సాయి పల్లవికి తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, బలమైన పాత్రలు ఉన్న సినిమాలనే ఆమె ఎంపిక చేసుకుంటున్నారు. భారీ పారితోషికం ఆఫర్ చేసినా, పాత్ర నచ్చకపోతే సినిమా చేయననే నిర్ణయంతో ఆమె ముందుకు సాగుతున్నారు.

ఇలాంటి సమయంలో నితీష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణం'లో సీత పాత్ర కోసం సాయి పల్లవిని ఎంపిక చేశారు. ఈ పాత్ర ఆమెకు నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు సమాచారం. అయితే ఈ సినిమా కోసం ఆమె ఎంత పారితోషికం తీసుకుంటున్నారనే విషయంపై ఇప్పటి వరకు అధికారిక సమాచారం రాలేదు.

తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, 'రామాయణం' రెండు భాగాల కోసం సాయి పల్లవి ఏకంగా రూ.20 కోట్ల పారితోషికం అందుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఈ భారీ పారితోషికానికి మరో కారణం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. 'రామాయణం' షూటింగ్ పూర్తయ్యే వరకు సాయి పల్లవి ఇతర సినిమాలకు కమిట్ కాకూడదనే ప్రత్యేక ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఆమెకు అధిక రెమ్యూనరేషన్ ఇచ్చినట్లు సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.పౌరాణిక చిత్రంలో సీత పాత్రకు అవసరమైన హావభావాలు, రూపం, శరీర భాష, భావోద్వేగాల కోసం సాయి పల్లవి పూర్తిగా ఈ ప్రాజెక్ట్‌పైనే దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో టాలీవుడ్, కోలీవుడ్‌లలో వచ్చిన పలు భారీ అవకాశాలను కూడా ఆమె వదులుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అయితే రూ.20 కోట్ల పారితోషికం, ప్రత్యేక ఒప్పందంపై ఇప్పటివరకు చిత్రబృందం లేదా సాయి పల్లవి నుంచి అధికారిక ధృవీకరణ రాలేదు. అయినప్పటికీ 'రామాయణం'లో సీత పాత్రను ఆమె అత్యంత నిబద్ధతతో పోషిస్తారనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034